స్వాతి వార పత్రిక, మే 21, 1999

"పాత గొంతును తన గొంతుతో పరిచయం చేస్తూ సంస్మరించే వ్యక్తి కొత్త గొంతులను పరిచయం చేస్తే ఆ ప్రోత్సాహం మాత్రం అతడి గొంతును దాటి పోగలదా?"

# నా గానం మీ కోసం

కొత్తొక వింత పాత ఒక రోత అన్నది సంగీత ప్రియుల విషయంలో నిజమని పించదు.

తాతగారు సంగీత ప్రియులు. అంతవరకూ ప్రాచుర్యంలో ఉన్న సంప్రదాయ సంగీతాన్ని సమర్థిస్తూ, అప్పుడే జనాల్లో సంచలనం సృష్టిస్తున్న సినిమా సంగీతాన్నాయన నిరసించేవారట. నాన్నగారికి సినిమా సంగీతం ఇష్టమే కానీ ఆయన రోజుల్లోదే బాగుండేదిట. నేను నా పిల్లలకు నా రోజుల్లో సినిమా పాటలను మించినవి లేవని అంటూంటాను.

ఆశ్చర్యమేమిటంటే తాతగారితో నాన్నగారు, నాన్నగారితో నేను ఏకీభవించలేదు కానీ నా పిల్లలు నాతో ఏకీభవించారు. ఈ శతాబ్దంలో యాభై తర్వాతా డెభైలలోపూ వచ్చిన పాటల లాలిత్యమూ, ప్రాశస్త్యమూ అలాంటిదేమో మరి!

అయితే నాకూ, నా పిల్లలకూ ఓ తేడా ఉంది. వాళ్ళు నాకులాకాక అన్ని తరాల పాటలూ వింటారు. అన్నింట్లోంచీ మంచిని ఏరుకుంటారు.

నాకులా వాళ్ళకు మా నాన్నగారి తరంపాటలన్నా ఎలర్జీ లేదు. నేటితరం పాటలపట్ల చిన్న చూపూ లేదు.

నేటితరం పాటలంలే నాకెంత చిరాకంటే నేను టీవీకి దూరంగా ఉంటాను. టీవీ ఛానెల్స్ మీద సినిమా పాటల ప్రభావమే ఎక్కువగా ఉండటం అందుకు కారణం.

మా ఇంట్లో టీవీ లేదు. పిల్లలూ నన్ను బలవంత పెట్టలేదు. ఎప్పుడైనా మంచి కార్యక్రమముంటే వాళ్ళు ఏ పక్కింటికో వెళ్ళి చూసివచ్చేవారు. ఆ విశేషాలు కూడా నేను వాళ్ళతో పంచుకునేవాణ్ణికాదు. కంసుడికి కృష్ణపదంలా ఉండేది నాకు టీవీ.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యారు. పెళ్ళిళ్ళయ్యాయి. వాళ్ళ గూళ్ళు వాళ్ళకు ఏర్పడ్డాయి. ఆ గూళ్ళలో వాళ్ళ అభిరుచులకనుగుణంగా సమస్తమైన సదుపాయాలూ

ఏర్పడ్డాయి. వాటిలో టీవీ కూడా ఉంది.

పిల్లలు దూరమయ్యేక ఇల్లద్దెకిచ్చాం. అద్దెకున్నవాళ్ళు మాకు తోడు. వాళ్ళకు మేము ఆసరా. వాళ్ళు మంచివాళ్లని మాకనిపించింది. మేము మంచివాళ్ళమని వాళ్ళు మా ముఖం మీద అంటారు. వాళ్ళలో నాకు నచ్చని పాయింటు టీవీ. అయితే వాళ్ళు టీవీ గురించి నాతో మాట్లాడకపోవడం నచ్చిన పాయింటు. నేనింకా రిటైరవలేదు. కాబట్టి శ్రీమతి ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. అప్పుడు వాళ్ళ టీవీ చూస్తుంది.

"టీవీ ఉంటే బాగానే ఉంటుందండీ–" అని మాత్రం నాతో అంటుంది శ్రీమతి. తన భావం అర్థమైనా నేను విని ఊరుకుంటాను.

రాక్షసుడైన జలంధరుడు భార్య దేవతలను పూజిస్తే అభ్యంతరం పెట్టలేదు. నాస్తికుడైన మహాకవి భార్య పూజలను అరికట్టాలనుకోలేదు.

భార్యల అభిరుచులను గౌరవించే సంస్కారం మనకు సంప్రదాయం నుంచి వచ్చింది. అందుకే నేను శ్రీమతిని టీవీ చూడవద్దని శాసించలేదు.

అయితే నేనూహించని విడ్డూరమొకటి జరిగింది. ఒకరోజు అద్దెకుంటున్న వాళ్ళబ్బాయి పదేళ్ళవాడు నా దగ్గరకొచ్చి, "అంకుల్! నాకు కొన్ని పాతపాటలు నేర్పాలి" అన్నాడు.

అందుకే నేను బోలెడు ఆశ్చర్యపడిపోతే పాటలడిగిన కారణం నన్నింకా ఆశ్చర్య పరిచింది.

ఒక తెలుగు టీవీ ఛానెల్ "నా గానం మీకోసం" అనే పాటల పోటీని నిర్వహి స్తోంది. ఔత్సాహిక గాయనీ గాయకులందులో పాల్గొని జాతీయస్థాయిలో గుర్తింపును పొందవచ్చు. అందుకని ఈ పోటీ రాష్ట్రంలో గొప్ప సంచలనాన్ని సృష్టించింది.

వారం వారం జరిగే ఈ పోటీల్లో పాల్గొనేటందుకు ఎందరో యువతీ యువకులు తమ దృష్టిని సంగీతం మీదకు సారిస్తున్నారు.

ప్రముఖ సినీ గాయకుడు రామరాజు ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడు. అతడా పోటీలను నిర్వహించే తీరు అద్భుతం.

రామరాజు ఏ భాషలో పాట పాడినా హిట్టవుతుంది. అతడి గొంతులో లలిత సంగీతాన్ని నిర్వచించగల లాలిత్యమూ, శాస్త్రీయతకు అవసరమైన వణుకులూ ఉన్నాయని పండితులూ, పామరులూ ఒప్పుకున్నారు.

ప్రతిభకు అదృష్టం తోడైన ఆ మహాగాయకుడి గొంతుకోసం ప్రతి చిత్ర నిర్మాతా తాపత్రయపడి ఆ అదృష్టంలో కొంత తనూ పంచుకోవాలనుకుంటాడు. అందువల్ల అతడు ఎంతో బిజీ.

అంత బిజీగా ఉన్న మనిషి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రతిభ విషయంలో అతడే తరమా అన్వేషియో తెలియజేస్తుంది.

రామరాజు యువతీయువకులకు భయం పోయేలా చొరవనిచ్చి వాళ్ళమధ్య తానూ ఒకడిలా కలిసిపోయి బాగా ప్రోత్సహించి వారిలోంచీ ప్రతిభనుమించిన పెర్ఫార్మెన్స్

రాబడతాడు. వారు చేస్తున్న తప్పులను, దిద్దుకోవాల్సిన మెరుగులను మనసుకు హత్తుకునేలాగా, ఏ మాత్రమూ నొప్పించని విధంగానూ తెలియబరుస్తాడు.

సమయానుకూలంగా పాటల రాగాలతో సహా సంగీతానికి సంబంధించిన ఎన్నో విషయాలనూ, విశేషాలనూ ఇటు ఔత్సాహికులకూ, అటు ప్రేక్షకులకూ అందజేస్తాడు. అన్నింటికీ మించి అంకితభావంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తాడు.

ఈ కారణాలవల్ల రాష్ట్రంలో సంగీతపరంగా సాంస్కృతిక విప్లవం వచ్చింది. ప్రతి ఇంటా మృదంగ వాయులీన వీణాది సాధనాలకు అనుగుణంగా పలుకుతూ సాధనలు చేసే గొంతులు వినిపిస్తున్నాయి. అంతవరకూ "నా గానం నా కోసం" అనుకునే బాత్రూం సింగర్సు కూడా "నా గానం మీ కోసం" అనుకోసాగారు.

ఇది గుర్తించిన రామరాజు ఈ సాంస్కృతిక విప్లవానికి పునాది కూడా అవసరమని భావించి ఈ పోటీలను పన్నెండేళ్ళలోపు పిల్లలకోసమని ప్రత్యేకంగా నిర్వహించాడు. దాంతో సంగీతానికే కాదు, సంగీతం టీచర్లకూ గిరాకీ పెరిగింది. ఎందరో బాలుర గొంతులో సంగీత మహావృక్షం మొక్కై వంగుతోంది.

ఆ సందర్భంలోనే పాత పాటలు కావాలని తన పుత్రరత్నం నా దగ్గరకు వచ్చినట్లు మా ఇంట్లో అద్దెకున్నాయన నాకు చెప్పాడు.

ఈ వివరాలు వినగానే అప్పటికప్పుడు రామరాజు వద్దకు వెళ్ళి పూలమాలలతో సత్కరించి పాదాభివందనం చేయాలనిపించింది. వయసులో బహుశా అతడు నాకంటే చిన్నవాడయుండవచ్చు. కానీ "ఏండ్లు మీరినవాడు వృద్ధుడు కాదని" మిత్రలాభ కపోతం ఏనాడో చెప్పిందిమరి.

"ఇంత మంచి కార్యక్రమం గురించి నాకు ముందుగానే చెప్పకపోవడం చాలా అన్యాయం-" అంటూ ఆయన్ను తప్పుపట్టాను.

"మీకు టీవీ అంటే ఎలర్జీ అని తెలిసినా మీరు పట్టిన కుందేటికి మూడేకాళ్ళు అనేరకం కాదనీ నాకు తెలుసు. అయితే ఏదో సందేహం నన్ను బాధిస్తూనే ఉంది. కానీ ఈ కార్యక్రమంలో ఎక్కడో ఏదో లోపముందని గట్టిగా అనిపిస్తోంది. అదేమిటో చెప్పలేకపోతున్నాను. అది తెలుసుకునేదాకా మీకు దీని గురించి చెప్పకూడదనుకున్నాను. కానీ ఇంకా తెలియలేదు-" అన్నాడాయన సంజాయిషీగా.

లోపమేమై ఉంటుందీ అని కాసేపు ఆయనతో చర్చించాను. ఫలానా అని తేల్చడం చాలా కష్టమైంది. పోటీలో పాల్గొనడానికి అభ్యర్థులను ఎన్నుకోవాలి కదా - అందుకు సరైన వాళ్ళను ఎన్నుకోవడం లేదా అంటే అందుకు తప్పుపట్టలేమంటాడు.

విజేతల విషయంలో న్యాయనిర్ణయం సరిగా లేదా అంటే క్రికెట్లో ఎల్బీడబ్ల్యూ కంటే బెటరుగానే ఉందన్నాడు. పొరపాట్లు ఎవరికైనా రావడం సహజమనీ ఈ బృహత్ప్రయత్నంలో ఆ కారణంగా లోపాలెంచడం సరికాదనీ ఆయన అన్నాడు.

"నా గానం మీకోసం కార్యక్రమం ఎంత నచ్చిందంటే కొన్నింటిని రికార్డు చేశాను. ఒకటి చూపిస్తాను- రండి" అన్నాడాయన. ఆ విధంగా ఇంకా నాలుగు రోజులదాకా

లైవ్ ప్రోగ్రాం కోసం ఆగనవసరం లేకుండానే ఆరోజే అది ఆయనింట్లో చూడగలిగాను.

ప్రోగ్రాం చూద్దును గదా - రామరాజును వళ్ళో కూర్చోపెట్టుకుని ముద్దులాడాలని పించింది. అంత గొప్పగా ఉంది. అందులో ముఖ్య విశేషం రామరాజు గతంలో సంగీతానికి సేవలందించిన వారిని సంస్మరించి వారి పాటల శాంపిల్సు వినిపిస్తున్నాడు.

“ఇది అద్భుతం. ఈ కార్యక్రమాన్ని వినడానికి చూడ్డానికీ ఈ సంస్మరణ ఒక్కటి చాలు” అన్నాను.

“ఈ విషయంలో మనిద్దరి అభిప్రాయాలూ, అభిరుచులూ ఒక్కటిలాగే ఉన్నాయి. కార్యక్రమంలోని ఈ భాగాలను నేను వేరే కాసెట్‌మీద రికార్డు చేసి ఉంచుకుంటాను” అన్నాడాయన.

ఇక మీదట ఈ కార్యక్రమం ప్రతివారం చూడాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను. అద్దెకుంటున్నాయనతో ఆ విషయం చెప్పాను.

దేవులపల్లి కృష్ణశాస్త్రికేమాత్రమూ తీసిపోని వీరభద్రం సినిమాలకు నాలుగే నాలుగు పాటలు రాసి అకాల మరణం చెందాడు. మరో రాజేశ్వరరావా అనిపించే రాంప్రసాద్ ఒకే ఒక్క చిత్రానికి సంగీత దర్శకత్వం చేసి సన్యాసుల్లో కలిసిపోయాడు. రఫీ గొంతు తెలుగువాడికి వచ్చిందా అనిపించే కృష్ణమోహన్‌కు సినిమా రాజకీయాల్లో అయిదు పాటలకు మించి పాడే అవకాశం రాలేదు. మూడు సినీ గీతాలకు అద్భుతంగా వీణను వినిపించిన వీర వెంకయ్యకు పక్షవాతం వచ్చి తగ్గేక మళ్ళీ వీణను వాయించలేదు.

ఇలాంటివారు సుమారు డజనుదాకా నాకు తెలుసు. వారికి నేను అభిమానిని.

ఆ పాటలు సంపాదించాలనీ, వినాలనీ నాబిజీ జీవితంలో కొన్ని ప్రయత్నాలు చేసి విఫలుడినయ్యాను. “నా గానం మీకోసం” గురించి ఇప్పుడు వినకపోతే వాటి విషయం గుర్తుండేదే కాదు.

అద్దెకుంటున్నాయన నేను చెప్పిన కొంతమంది వ్యక్తుల పేర్లు విని -“అయ్యా రామరాజు వీరిలో కొందరిని ఇప్పటికే పరిచయం చేశాడు. ఆయా భాగాలు చూసే అవకాశం మీకుంది. ఓ గంటలో మీకా ఏర్పాటు చేస్తాను” అన్నాడు.

ఆ గంటలోనూ నేను రామరాజుని మనసులో ఎన్నిసార్లు అభినందించానో చెప్పలేదు.

అద్దెకుంటున్నాయన నాకోసం అన్ని ఏర్పాట్లూ చేశాడు. ముందుగా వీరభద్రం రాసిన నాలుగు పాటల పల్లవులూ వినిపించాడు రామరాజు.

ఎన్నాళ్ళకెన్నాళ్ళకా పాటలు వినడమయిందీ అని పులకించి పోయాను. తర్వాత రాంప్రసాద్ కట్టిన వరుసలు - వరుసగా అయిదు పాడాడు రామరాజు. నాకు మళ్ళీ ఆ రోజులు గుర్తొచ్చి, “రాం ప్రసాద్ - రామరాజు నీకు పునర్జన్మనిచ్చాడు-” అనుకున్నాను.

“ఇప్పుడు కృష్ణమోహన్ పాట-” అన్నాడు అద్దెకుంటున్నాయన.

ఆ గొంతు వినడానికి నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. చెవులు రిక్కించాను. శరీరమంతా ఏదో తెలియని ఉద్వేగం....

పాట మొదలయింది....

కానీ ఇదేమిటి? గొంతు కృష్ణమోహన్‌ది కాదు... రామరాజుది.

ఒక కవి గేయాన్నీ, సంగీత దర్శకుడి వరుసనూ తన గొంతులో వినిపించి పరిచయం చేయడం వరకూ బాగానే ఉంది. కానీ ఒక గాయకుడి గొంతును సంస్మరించడమూ ఇలాగేనా?

అంతటితో ఆగలేదు.

రామరాజు వీరవెంకయ్య వీణను కూడా - టీంటీం అంటూ తన గొంతులోనే వినిపించాడు.

"ఆపండి-" అన్నాను అడ్డెకుంటున్నాయనతో. "ఈ కార్యక్రమం పేరు 'నా గానం మీకోసం' కదా! పేరులో నేను అన్న అహం కనబడుతోంది. అదే ఈ కార్యక్రమం లోపమేమో!"

ఆయనకు నా మాట అర్థమయిందో లేదో తెలియదు. కానీ పాత గొంతును తన గొంతుతో పరిచయం చేస్తూ సంస్మరించే వ్యక్తి కొత్త గొంతులను పరిచయం చేస్తే ఆ ప్రోత్సాహం మాత్రం అతడి గొంతును దాటిపోగలదా?

కృష్ణమోహన్, వీరవెంకయ్యల విషయంలో నాకు కలిగిన నిరుత్సాహం - "నా గానం మీకోసం"లోని నా అన్నపదం ఒక్క రామరాజుకే చెందుతుందనీ కేవలం అతడికి మాత్రమే చెందుతుందనీ పదే పదే అనిపించేలా చేస్తోంది.

✦ ✦ ✦